క్లుప్తంగా

నేటి నుంచి వికసిత్ భారత్ యాత్ర

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలకు వివరించేందుకు మంగళవారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. 23న బసినేపల్లి, పెరవలిలో, 24న బొమ్మనపల్లి, యడవలిలో, 25న హంప, ఎం.అగ్రహారంలో, 27న బురుజుల, మద్దికెరలో ఉదయం, మధ్యాహ్నం కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందించిన ఎంపీపీ

కృష్ణగిరి: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని కోయిలకొండ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో అందించిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. హెచ్ఎం మైఖెల్, వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి శంకరయ్య, గోవిందరాజులు, సంజీవులు, బాలు, బాలమద్దయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పీఆర్ ఏఈ, సెక్టోరియల్ అధికారులు జయన్న, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎంఈఓ–2 రఘునాథ్ ఆధ్వర్యంలో సెక్టోరియల్ అధికారులు పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు, విద్యుత్ వంటి సదుపాయల కల్పనపై దృష్టి సారించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు సెక్రటరీగా పద్మావతి



ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీగా పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా తనకల్లు యార్డు నుంచి బదిలీపై వచ్చిన ఆమె స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ యార్డు అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఇక్కడ సెక్రటరీగా పనిచేసిన మాధవ కృష్ణారెడ్డి డోన్ మార్కెట్ యార్డుకు బదిలీ అయ్యారు.

నేడు పత్తికొండలో ఆసరా కార్యక్రమం

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలోని టీటీడీ కళ్యాణమండపంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీఓ కవిత, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మధుబాబు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆసరా కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కును అందజేస్తారన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మెకానిక్‌గా పనిచేస్తూ గత కొద్ది రోజుల క్రితం లివర్ సంబంధిత వ్యాధితో ఉరుకుంద అనే వ్యక్తి మృతిచెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన తక్షణ సాయం రూ.10 వేలను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు లుముంబా చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ మిగతా సొమ్ము రూ.90 వేలు 15 రోజుల్లోపు నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు.

పంటకోత మిషన్ యజమానిపై డ్రైవర్ల దాడి

ఆలూరు రూరల్: పంటకోత మిషన్ ఓనర్‌పై డ్రైవర్లు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని అరికెర గురుకులం పాఠశాల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం కురుగోడు గ్రామానికి చెందిన అనిల్ కుమార్ పంట కోత మిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద హర్యానాకు చెందిన ఇద్దరు వ్యక్తులు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఆస్పరి మండలం జొహరాపురంలో కంది పంట కోత అనంతరం స్వగ్రామం కురుగోడుకు బయలుదేరారు. మిషన్ వెనుక స్కూటర్‌పై వస్తున్న ఓనర్‌ను ఆపి విక్షణారహితంగా చితకబాది అతని వద్ద ఉన్న లక్ష రూపాయలు అపహరించుకుని వెళ్లారు. ప్రయాణికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించగా క్షతగాత్రుడిని ఆలూరు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెల్దుర్తిలో సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వెల్దుర్తిలో పల్లకీలో ఆశీనులైన సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులు



శంకరబండలో శ్రీరాముడిని దర్శించుకుంటున్న భక్తులు



ఎమ్మిగనూరులో ఊరేగింపులో సీతారాములు, లక్ష్మణ,ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు

మార్మోగిన రామనామం

వెల్దుర్తి(కృష్ణగిరి): అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకుని స్థానిక రామాలయంలో అర్చకులు రాఘవయ్య సోదరుల ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు, పట్టణ పురవీధుల గుండా ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించగా విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు బొమ్మన సుబ్బారెడ్డి, దశరథరామిరెడ్డి, రవిరెడ్డి, ఎల్లనాగిరెడ్డి, ఎల్ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పుల్లగుమ్మిలో ఎంపీటీసీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల చిత్రపటాలకు పూజలు, భజనలు చేపట్టారు. రామళ్లకోటలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తలు శ్రీకాంత్ కుటుంబీకుల ఆధ్వర్యంలో రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, హలిగేర, పుటకలమర్రి గ్రామాలలోని ఆంజనేయ స్వామి, లింగమేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామాలలో జై శ్రీరామ్ నామస్మరణ మార్మోగింది. ఆస్పరిలో విద్యార్థులు సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి వేషధారణలో ఆకట్టుకున్నారు. శంకరబండ గ్రామంలో సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. గ్రామాలలో భక్తిశ్రద్ధలతో ప్రతి ఇంటి ముందు 5 జ్యోతులు వెలిగించారు.

అభయాంజనేయుడికి అఖండ దీపారాధన

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక హైవే 44 పక్కన నిర్మితమైన 51 అడుగుల భారీ అభయాంజనేయ స్వామి పాదాల చెంత సోమవారం సాయంత్రం గ్రామ పెద్దలు బొమ్మన దశరథరామిరెడ్డి, బొమ్మన రవిరెడ్డి, తిరివీధి సాయిప్రసాద్ తదితరుల చేతులమీదుగా అఖండ దీపారాధన జరిగింది. ధార్మిక వేత్త వడ్డె చిరంజీవి సొంత ఖర్చుతో అఖండ దీపం ఏర్పాటు చేశారు. శ్రీరాముల ఆలయంలో వందలాది మహిళలకు విగ్రహ నిర్వాహకుడు రామాంజనేయులు ఒడి బియ్యం ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా భక్తులు దీపాలు చేతబట్టి పట్టణ పురవీధుల గుండా సాగుతూ అభయాంజనేయుని చెంతకు చేరి స్వామి పాదాల చెంత ఉంచారు. లక్ష దీపాలు వెలిగించి అఖండ దీపారాధన చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో విశ్వ హిందూ పరిషత్, పలు కుల సంఘాల ఆధ్వర్యంలో శ్రీరాముడి విగ్రహం, చిత్రపటాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. స్థానిక అన్నమయ్య సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు ఎద్దుల బండ్లపై శ్రీరాముడి ఫ్లెక్సీలతో ఊరేగింపు నిర్వహించగా చిన్నారులు శ్రీరాముడు, లక్ష్మణుడి వేషధారణలో పాల్గొన్నారు. సోమప్ప సర్కిల్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు.



వెల్దుర్తి అభయాంజనేయుడి విగ్రహం వద్ద అఖండ దీపం వెలిగించిన గ్రామ పెద్దలు

హొళగుంద: మండలంలోని ప్రతి పల్లెలో శ్రీరామ చిత్రపటంతో శోభాయాత్ర ఘనంగా జరిగింది. శ్రీరామ భక్తులు, హనుమాన్ మిత్ర మండళి సభ్యులు భారీ ఎత్తున పాల్గొన్నారు. పురవీధుల్లో రాముడి చిత్రపటాన్ని ఊరేగించారు. ఆలయాల్లో ప్రదక్షిణలు, అభిషేకాలు, పవమాన హోమం, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

తుగ్గలి: మండలంలో పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందాలు కీర్తనలు ఆలపించారు. భక్తులకు అన్నదానం చేశారు. తుగ్గలి, జొన్నగిరి, పి.కొత్తూరు, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లో శ్రీరాముడి చిత్రపటాన్ని ఎద్దులబండ్లు, ట్రాక్టర్లపై ఉంచి మేళతాళాలతో ఊరేగించారు.

దేవనకొండ: దేవనకొండతోపాటు తెర్నేకల్, పాలకుర్తి, పి.కోటకొండ తదితర గ్రామాల్లో సీతారాముల చిత్రపటాలను గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దేవనకొండ వడ్డె వీధిలోని రామాలయం నుంచి పంచాయతీ భవనం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.

హాలహర్వి: మండలంలోని గూళ్యం, బిలేహాల్, చింతకుంట, నిట్రవట్టి, బాపురం, హాలహర్వి గ్రామాల్లో రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.



దేవనకొండ: సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వేషధారణలో చిన్నారులు

నందవరం: మండలకేంద్రంతో పాటు నాగలదిన్నె, కనకవీడు, ముగతి, హాలహర్వి, గురజాల, రాయచోటి, జోహరాపురం తదితర గ్రామాల్లో శ్రీరామ, అంజనేయ స్వామి శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఆలయాల్లో పురోహితులు స్వామివార్లకు విశిష్ట పూజలు గావించారు. భక్తులు పూజలు చేశారు. నాగలదిన్నెలో రామలక్ష్మణ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పిండి వంటల నైవేద్యాలు సమర్పించి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను స్వామి వార్లకు సమర్పించి తలపై జల్లుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే సాయంత్రం గురజాల, నాగలదిన్నె, రాయచోటి, కనకవీడు తదితర గ్రామాలలో శ్రీరాముని చిత్రపటాలు, విగ్రహాలతో శోభయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు.



హంపలో స్వామి చిత్రపటాలను ఊరేగిస్తున్న భక్తులు



నాగలదిన్నె శోభయాత్రలో రామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి వేషధారణలో చిన్నారులు

కృష్ణగిరి: అయోధ్య నగరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా సమస్త మానవకోటికి సకల శుభాలు కలగాలని, శ్రీరాముడి ఆశీస్సులు అందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి అభిలషించారు. సోమవారం చుంచు ఎర్రగుడి ఆలయంలో సీతారాములకు పెద్దలతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెనుమాడ గ్రామంలో భక్తులు రామ భజన సంకీర్తన నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. వందేళ్ల నాటి కోదండరామస్వామి ఆలయంలో సీతారామ మూలవిరాట్‌లకు అభిషేకం, అష్టోత్తరనామార్చన, నైవేద్యం తదితర కార్యక్రమాలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. పెరవలిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా హోమాలు చేయించారు. భక్తులు జైశ్రీరాం అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

ఆలూరు: స్థానిక గుంతకల్లు రోడ్డు సమీపంలోని రాయాలయంలో పండితులు రవిశాస్త్రి, రాఘవాచారి తదితరుల వేదమంత్రోచ్ఛరణ నడుమ సీతారాములు కల్యాణోత్సవం జరిపించారు. పెద్దెత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే కమ్మరచేడు, మొలగవెల్లి, ముద్దనగేరి, తదితర గ్రామాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.



హొళగుందలో శ్రీరామ చిత్రపటంతో శోభయాత్ర జరుగుతున్న దృశ్యం

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న విరుపాక్షి

దేవనకొండ: నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త ఇన్‌చార్జి విరుపాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పాలకుర్తి, మాచాపురం, తెర్నేకల్ గ్రామాల్లో ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి సమన్వయకర్తగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కార్యకర్తలతో మాట్లాడుతూ.. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా కుటుంబ సభ్యుడిగా బాధ్యత వహిస్తానని భరోసా ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు పాలకుర్తి హర్షవర్ధన్ రెడ్డి, ఉమాకాంత్ రెడ్డి, తపాల శ్రీనివాసులు, గుడిమిరాళ్ల సుధాకర్‌నాయుడు, మండల కన్వీనర్ మల్లికార్జున, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' మంజూరు

తుగ్గలి: వైఎస్సార్ ఆసరా పథకం చివరి విడత కార్యక్రమంలో భాగంగా నిధులను మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. మండలవ్యాప్తంగా 673 డ్వాక్రా సంఘాల్లోని 6,914 మంది పొదుపు మహిళల ఖాతాలకు రూ.3.84 కోట్లు జమ కానుంది. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.11.46 కోట్లు రుణమాఫీ సొమ్మును సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసింది. చివరి విడత సొమ్ము మంగళవారం జమ చేయనున్నారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.15.36 కోట్లు మాఫీ సొమ్ము పొదుపు మహిళలకు లబ్ధి చేకూరిందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు మండలంలో త్వరలో నిర్వహించే వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని ఆయన వెల్లడించారు.

సర్పంచ్‌కు తీవ్రగాయాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెండ్లిమాన్ తండా గ్రామ సర్పంచ్ లక్ష్మానాయక్ రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. పత్తికొండలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. పత్తికొండ– హోసూరు రోడ్డులోని హంద్రీ-నీవా కాలువ వద్ద బైక్ అదుపుతప్పి హోసూరు గ్రామ యువకుడు సునీల్ గాయాలపాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు.

సచివాలయ అద్దాలు ధ్వంసం

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో నూతనంగా నిర్మించి ప్రారంభించిన సచివాలయం భవనం కిటికీల అద్దాలను, నీటి పైప్‌లైన్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం విధి నిర్వహణకు వచ్చిన సచివాలయ ఉద్యోగులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



ఆర్బీకే శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలో పార్టీలో చేరిన ఎరుకలచెరువు గ్రామస్తులు

కృష్ణగిరి: ఇంటి ముంగిటికే ప్రభుత్వ సేవలు తెచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని టి.గోకులపాడులో రూ.64 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలను ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, ఎంపీటీసీ రామేశ్వరమ్మ, వ్యవసాయ సలహా సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లం మహేశ్వరరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏదైనా సంక్షేమ పథకం కావాలన్నా, ప్రభుత్వ సేవలు పొందాలన్నా మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులుండేవన్నారు. కనీసం అవ్వాతాతలు పింఛన్ అందుకోవాలన్నా అష్టకష్టాలు పడేవారని గుర్తుచేశారు. వైఎస్ జగనన్న పాలనలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలన్నింటినీ అందిస్తున్నారని వలంటీర్ల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గోకులపాడులో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, హంద్రీ నదిపై రూ.7 కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామన్నారు. తమ ఏళ్లనాటి బ్రిడ్జి కలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యేను గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. ఏఓ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ అబ్దుల్ వహీద్, ఈఓఆర్డీ మురళీమోహన్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, తెలుగు మల్లయ్య, నీలకంటి తిమ్మరాజు, పూలరాజు, అల్లిపీర, అల్లిసాహెబ్, బ్రహ్మానందరెడ్డి, మాధవరావు, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు గోకులపాడు వచ్చిన ఎమ్మెల్యే సమక్షంలో ఎరుకులచెరువు గ్రామం ఎస్సీ వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు మాదిగ సుంకన్న, గిడ్డయ్య, రామలక్ష్మన్న, చిన్న గిడ్డయ్య, ఎల్లప్పతోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీతోపాటు నాయకుడు కావలి ప్రహ్లాద పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

ఎమ్మిగనూరురూరల్: తప్పులు లేని తుది ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు జెడ్పీ సీఈఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాసరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తాలుకా స్థాయి తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తయారు చేసిన ఓటరు జాబితాను ఆయా బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల దగ్గర ప్రదర్శిస్తారని చెప్పారు. నియోజకవర్గవ్యాప్తంగా.. పట్టణంలో 81,841 మంది ఓటర్లు ఉండగా, రూరల్‌లో 56,838 మంది, గోనెగండ్లలో 57,922 మంది, నందవరంలో 46,466 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. మొత్తం పురుష ఓటర్లు 1,19,769 మంది ఉండగా, మహిళలు 1,23,253 మంది ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితాను సరిచూసుకొని ఏమైనా తప్పులున్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. తహసీల్దార్లు ఆంజనేయులు, నిత్యానంద్, వేణుగోపాల్‌రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాసరరెడ్డి

పత్తికొండటౌన్: పత్తికొండ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను సోమవారం సాయంత్రం ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి విడుదల చేశారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. వారి సమక్షంలో ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి ఓటర్ల తుదిజాబితాను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 2,19,639 కాగా అందులో పురుషులు 1,09,673, స్త్రీలు 1,09,943, థర్డ్ జెండర్ 23 మంది ఉన్నట్లు తెలిపారు. మరణించిన వారు 6887 మంది ఓట్లను తొలగించామన్నారు. వివిధ కారణాలతో మొత్తం 14004 ఓట్లు తొలగించామన్నారు. కొత్తగా 14273 మందికి ఓటు హక్కు నమోదు చేసినట్లు ఆర్‌డీఓ తెలిపారు. వివిధ కారణాలతో ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోని అర్హులైన ఓటర్లు ఈ నెలాఖరులోగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీఓ సూచించారు. తహసీల్దార్ విష్ణుప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసి తుది జాబితాను విడుదల చేసినట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున అన్నారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా కసరత్తు పకడ్బందీగా చేపట్టామన్నారు. గతేడాది అక్టోబర్ 10న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించామన్నారు. అనంతరం వచ్చిన అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు చేశామని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 294 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,27,600 మంది పురుషులు, 1,26,273 మంది మహిళా ఓటర్లు ఉండగా 54 మంది ఇతరులు ఉన్నారని మొత్తం ఓటర్లు 2,53,927 మంది ఉన్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సెక్టోరల్ అధికారులకు సూచించామన్నారు. ఏఈఆర్వో రామాంజనేయులు, ఎన్నికల డీటీ గుండాల్ నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్ తదితరులు ఉన్నారు.

పంటల పరిశీలన

హొళగుంద: మండలంలో రైతులు సాగుచేసిన వరి పైర్లను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేశ్ నాయక్ సోమవారం కోగిలతోట, సమ్మతగేరి, వన్నూరు కొట్టాల తదితర గ్రామాలలో ఏఓ అనంద లోకదళ్‌తో కలిసి పంటలను పరిశీలించారు. వరి పైరులో కాండం తొలిచే పురుగు ఉధృతిని గమనించారు. పురుగు నివారణకు వాడాల్సిన మందులు, అలాగే గంధకం తీవ్రతను తగ్గించేందుకు అవసరమైన ఎరువులు, మందుల వివరాలను రైతులకు తెలియజేశారు. వారితో పాటు ఏఈఓ విరుపాక్షి, వీఏఏలు ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో మలుపు వద్ద 2 రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడ్డ ముగతి గొల్ల నరసింహారెడ్డి (39) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో పలు అభివృద్ధి పనులను ముమ్మరం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు శిథిలమైన రోడ్డు పునర్నిర్మాణం, మరమ్మతు పనులను మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. రోడ్డు పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతతో వుండేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. డీఈ నీరజ తదితరులు ఉన్నారు.

రైతు ఆత్మహత్య



మృతి చెందిన మఠం మునిస్వామి

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో మఠం మునిస్వామి (46) అనే రైతు అప్పులు బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ హనుమంతప్ప సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. మునిస్వామికి 9 ఎకరాల పొలం ఉంది. రెండేళ్లుగా పంటలు సరిగా పండక పెట్టుబడులు కోసం రూ.6.50 లక్షలు అప్పు చేశాడు. అంతేగాక మునిస్వామి ఏడాది క్రితం ఎద్దుల బండి పైనుంచి కింద పడడంతో కాలికి గాయమైంది. ఓ వైపు అప్పులు, మరోవైపు కాలు నొప్పి భరించలేక ఆదివారం పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. మునిస్వామికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో విద్యుత్ వెలుగులతో సుందరీకరణకు ప్రాధాన్యతనిస్తూనే శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదోని రోడ్డులో అన్నమయ్య సర్కిల్ నుంచి శివ సర్కిల్ వరకు రూ.46 లక్షలతో ఏర్పాటు చేసిన రోడ్డు డైవైడర్ల మధ్య సెంట్రల్ లైటింగ్ సిస్టంను సోమవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి కోట్లాది నిధులతో పనులు చేయిస్తున్నామన్నారు. రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల పనులు చేపట్టడం జరిగిందన్నారు. మున్సిపల్ డీఈలు మనోహర్ రెడ్డి, నీరజ, ఏఈలు శరత్‌కుమార్, మధన్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిలర్లు శివప్రసాద్, డిష్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.